సాక్షి సూర్యాపేట

మంగళవారం । 10 । జనవరి । 2023



ఉద్యోగులకు అండగా ఉంటా

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



సీపీఎం నేత కాంతారెడ్డి మృతి

సీపీఎం సీనియర్ నాయకుడు ఉప్పల కాంతారెడ్డి(88) సోమవారం తెల్లవారు జామున మృతిచెందారు. - 10లో

గరిష్టం/కనిష్టం
29.0°/14°

వాతావరణం

ఉదయం ఆకాశం పొగమంచుతో మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

సూర్యాపేట క్రైం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రాజేంద్రప్రసాద్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్‌కార్యాలయలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదుదారుడితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వీటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలు వ్యక్తిగత వివరాలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఇతరులకు చెప్పవద్దన్నారు. ప్రజలు అపరిచితుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని కోరారు. ప్రజలు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రీవెన్స్‌డేలో 12 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట : జిల్లా భరోసా సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ సెంటర్‌లో పనిచేయడానికి 22 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా భరోసా సెంటర్ అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న భరోసా సెంటర్‌లో పనిచేయడానికి మహిళా అభ్యర్థులు కావాలని పేర్కొన్నారు. అర్హత పత్రాలతో ఈ నెల 12న దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

గోదావరి జలాలు పెంపు

అర్వపల్లి : ఎస్సారెస్పీ రెండో దశ కాల్వలకు గోదావరి జలాలను సోమవారం పెంచారు. ఆదివారం 800క్యూసెక్కులు వదలగా సోమవారం 14 క్యూసెక్కులకు పెంచారు. రెండు రోజుల్లో మరిన్ని నీటిని పెంచుతామని నీటిపారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ తెలిపారు. రైతులు గోదావరి జలాలను వృథా కానివ్వొద్దని, పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

శ్రీరాముడి విగ్రహాన్ని తాకిన సూర్య కిరణాలు



గరిడేపల్లిలో శ్రీరాముడి విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు

గరిడేపల్లి: గరిడేపల్లి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో సోమవారం సూర్యకిరణాలు శ్రీరాముడి విగ్రహానికి తాకాయి. ధనుర్మాసోత్సవాలు జరుగుతుండగా సూర్య కిరణాలు దేవుడిపై పడటంతో భక్తులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారులు సుదర్శనం శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు పాల్గొన్నారు.

ట్యూటర్ల నియామకానికి గ్రీన్ సిగ్నల్

నల్లగొండ టౌన్ : నల్లగొండ, సూర్యాపేట ప్రభుత్వం మెడికల్ కళాశాలల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిని ట్యూటర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నల్లగొండ మెడికల్ కాలేజీలో 18 మందిని, సూర్యాపేట మెడికల్ కాలేజీలో 18 మంది ట్యూటర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. వీరికినెలకు రూ.57,700 గౌరవ వేతనం చెల్లించనున్నారు.

మహా శివుడికి విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. హోమ మండపంలో అగ్ని ప్రతిష్ఠ చేసి రుద్రహవనం, అనంతరం పూర్ణాహుతి చేపట్టారు. సకల ఆయురారోగ్యాలు, దోష నివారణార్థం రుద్ర హవనం జరిపించినట్లు పూజారులు పేర్కొన్నారు. ఇక మహాశివుడికి అభిషేకం, అర్చనలు, గర్భాలయం, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు చేసి హారతినిచ్చారు. యాదాద్రీశుడి ప్రధానంలో సుప్రభాతం, అర్చన, శ్రీసుదర్శన హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం గావించారు.

ఒడిశా పిల్లలకు బడి ఏర్పాటు

ఆత్మకూర్-ఎస్(సూర్యాపేట) : మండల పరిధిలోని పాతసూర్యాపేట శివారులో గల ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న 5 నుంచి 18 సంవత్సరాల విద్యార్థులు దాదాపు 40 మందికి స్థానికంగా బడి ఏర్పాటు చేసి విద్యనందించనున్నట్లు సెక్టోరియల్ అధికారి జనార్దన్ తెలిపారు. సోమవారం వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాతసూర్యాపేట శివారులోని ఇటుక బట్టీలను సందర్శించారు. 40 మంది విద్యార్థులను గుర్తించి ఒక వలంటీర్‌ను నియమించామన్నారు. విద్యార్థులకు పలకలు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధారాసింగ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రంగాచారి, నాగేశ్వర్‌రావు, సీఆర్‌పీ జ్యోతి, ఎంవీఎఫ్ మండల ఇన్‌చార్జ్ వత్సవాయి లలిత, ఆర్గనైజర్ నాయిని సైదులు ఉన్నారు.



ఒడిశా విద్యార్థులకు పలకలు అందిస్తున్న అధికారులు

చలి పంజా..!

- మూడురోజులుగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఈ నెల 8వ తేదీన 13 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న చిన్నారులు, వృద్ధులు

భానుపురి (సూర్యాపేట) : చలి తీవ్రత కారణంగా జిల్లా ప్రజలు వణికిపోతున్నారు. సంక్రాంతి పర్వదినం దగ్గర పడుతుండగా ఒక్కసారిగా చలి ప్రభావం పెరిగింది. పగటిపూట సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటుండగా.. రాత్రిపూట ఉష్ణోగ్రతలు రెండు, మూడు రోజులుగా గణనీయంగా పడిపోతున్నాయి. ఈనెల 6న 21 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్ర నమోదుకాగా 9వ తేదీన ఒక్కసారిగా 7 డిగ్రీలకు తగ్గింది. ఈ చలికి వృద్ధులు, పిల్లలతో పాటు దీర్ఘకాలంగా అనారోగ్యాలతో బాధపడుతున్న జనం ఇబ్బందులు పడుతున్నారు.

గత ఏడాది సీజన్‌తో పోల్చితే..

శీతాకాలం ప్రారంభం నుంచి చలి తీవ్రత అంతంత మాత్రంగానే ఉంది. ఈ సీజన్ మొదలై రెండు నెలలు కావొస్తున్నా చలితో ఇబ్బంది పడిన రోజులు తక్కువగానే ఉన్నాయి. గతేడాది నవంబర్ చివరి వారంలో తుపాన్ ప్రభావంతో వారం పాటు చలిగాలులు వీచాయి. ఈ క్రమంలో నవంబర్ 30వ తేదీన 13 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అంతకు ముందు, ఆ తర్వాత కూడా సాధారణ ఉష్ణోగ్రతలే జిల్లాలో ఉన్నాయి. పగటిపూట 30 డిగ్రీల వరకు.. రాత్రి సమయంలో 20 డిగ్రీలకు తగ్గకుండా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 2021– 22 శీతాకాలంతో పోల్చినా ఈ యేడు చలి తీవ్రత అంతగా లేదు. గత సీజన్ డిసెంబర్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు వారం రోజుల పాటు కనిష్ట ఉష్ణోగ్రతలు 15నుంచి 19 డిగ్రీల మధ్య నమోదయ్యాయి.



ఆత్మకూర్‌లో చలిమంట వేసుకుని ఉపశమనం పొందుతున్న జనం

ఉష్ణోగ్రతల వివరాలు

	2023		2022	
తేదీ	కనిష్టం	గరిష్టం	కనిష్టం	గరిష్టం
3న	20	29	15	29
4న	20	29	15	29
5న	20	27	17	29
6న	21	26	17	28
7న	18	29	18	28
8న	13	28	19	29
9న	14	29	19	29

ఒక్కసారే 7డిగ్రీలు తగ్గుదల..!

సాధారణంగా జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో నవంబర్ రెండోవారం నుంచి చలి తీవ్రత పెరుగుతోంది. సంక్రాంతి తర్వాత కూడా దీని ప్రభావం ఉంటుంది. ఈ సమయంలో 15 డిగ్రీలకు అటుఇటుగా ఉష్ణోగ్రతలు నమోదవుతూ ఉంటాయి. అయితే జిల్లాలో ఈనెల 3, 4, 5వ తేదీల్లో 20 డిగ్రీలు, 6న 21 డిగ్రీల చొప్పున ఉన్న కనిష్ట ఉష్ణోగ్రతలు 8న తేదీన 13 డిగ్రీలుగా నమోదైంది. దీంతో అప్పటి వరకు ఏసీలను సైతం వాడిన జనం.. రెండు రోజులుగా ఫ్యాన్లను సైతం బంద్ చేయాల్సి పరిస్థితి ఏర్పడింది. ఉదయం 6గంటలకే స్కూళ్లు, ఇతర పనులను వెళుతున్న విద్యార్థులు, ప్రజలు చలి కారణంగా గజగజ వణుకుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నాట్లకు వెళుతున్న కూలీలు, రైతాంగం చలికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల వరకు దీని ప్రభావం ఉండగా.. తిరిగి 5గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి.

చిమిర్యాల గ్రామ పంచాయతీ రికార్డులు సీజ్

కోదాడ రూరల్ : మండల పరిధిలోని చిమిర్యాల గ్రామ పంచాయతీ నిధులను సర్పంచ్, కార్యదర్శి దుర్వినియోగం చేశారని ఎంపీటీసీ కలకొండ సౌజన్య డీపీఓకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదుపై స్పందించిన డీపీఓ యాదయ్య.. డీఎల్‌పీఓ శ్రీరాములును విచారణకు ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు సోమవారం గ్రామ పంచాతీయ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఓ కంపెనీ వారు విరాళంగా ఇచ్చిన ఎల్‌ఈడీ బల్బులకు ఎంబీలు చేసి నిధులు డ్రా చేశారని, పంచాయతీ ట్రాక్టర్ వాడకంలో అవకతవకలకు పాల్పడ్డారని, దాత విరాళంగా ఇచ్చిన స్థలంలో డంపింగ్ యార్డు ఏర్పాటు, హరితహారం మొక్కలు, డ్రెయినేజీ పనులు చేయకుండానే చేసినట్టుగా, బ్లీచింగ్ చల్లకుండానే చల్లినట్టుగా, చెత్తబుట్టలు పంపిణీ చేయకుండానే చేసినట్లుగా లక్షల రూపాయాల బిల్లులు డ్రా చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారనే 15 అంశాలను విచారణలో డీఎల్‌పీఓ వెల్లడించారు . ఈ ఆరోపణలపై గ్రామంలో 15 రోజుల్లో విచారణ చేపట్టి పనులు చేయకుండానే చేసినట్లు, చేయని పనులకు చెక్కుల ద్వారా నిధులు డ్రా చేసినట్లు రుజువు అయితే బాధ్యులపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ రికార్డులను సీజ్ చేసి ఆయన వెంట తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండా శైలజ, ఎంపీఓ తుమ్మల నాగేశ్వరావు, కార్యదర్శి వీరబాబు, ఉప సర్పంచ్ జానీబేగం, వార్డు సభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.



విచారణ చేస్తున్న డీఎల్‌పీఓ శ్రీరాములు

పాత పద్ధతిలోనే పోలీస్ రిక్రూట్‌మెంట్ నిర్వహించాలి

నేరేడుచర్ల: పోలీస్ అభ్యర్థులకు పాత పద్ధతిలోనే రిక్రూట్‌మెంట్ నిర్వహించి న్యాయం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలక రాజు శ్రీను, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు ఎడ్ల సైదులు కోరారు. సోమవారం వారు ప్రగతి భవన్ ముట్టడికి తరలివెళ్తుండగా నేరేడుచర్ల పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను పాత పద్ధతిలోనే నిర్వహించకపోవడం వల్ల ఈవెంట్స్‌లో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీనిపై అభ్యర్థులు రా ష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, సాయి గౌడ్, సైదులు తదితరులున్నారు.

మహిళా చైతన్యానికి ప్రతీక గీతాముఖర్జీ

- మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి

హుజూర్‌నగర్ : మహిళా చైతన్యానికి ప్రతీక గీతాముఖర్జీ అని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. గీతాముఖర్జీ జయంతి వారోత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్‌లోని మహిళా సమాఖ్య భవనంలో సోమవారం ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. భారత జాతీయ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా పనిచేసిన గీతాముఖర్జీ విద్యారంగ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారన్నారు. అంతే కాకుండా ఎంపీగా మహిళల సమస్యలపై పార్లమెంట్‌లో గళం విప్పారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు యల్లావుల సీత, సుందరి పద్మ, బండి ప్రమీల, ఆకాంక్ష, శ్రీలత, శిరీష, ఉమా, అలివేలు, శశి, విజయ, శైలజ, శిరీష, రత్నకుమారి పాల్గొన్నారు.



ముఖర్జీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి

13, 14 తేదీల్లో యూటీఎఫ్ మహాసభలు

సూర్యాపేటటౌన్ : ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్‌లో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్.రాములు వెల్లడించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని యూటీఎఫ్ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను అయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడారు. ఈ మహాసభల్లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ ఎమ్మెల్యే కె.శైలజ, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పాల్గొంటారని తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.సోమయ్య, కె.అరుణభారతి, వెంకటయ్య, యాకయ్య, సయ్యద్, బండి పాపిరెడ్డి, ఆడమ్, అనిల్‌కుమార్, క్రాంతిప్రభ, లాలు, రమేష్, లింగయ్య, ఆనంద్, కరుణాకర్‌రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజావాణిలో ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 32 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రతి వారం దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా పరిష్కారం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం

వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ పంటను సాగు చేసి రైతులు అధిక ఆదాయం పొందాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ సూచించారు. సోమవారం హార్టికల్చర్ క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి తక్కువ సమయంలో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగుపై ఉద్యాన, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాన కల్పించి ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ యస్. మోహన్‌రావు, ఉద్యాన శాఖ అధికారి బెల్లంకొండ శ్రీధర్ గౌడ్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

మూడు స్వచ్ఛ గురుకులాలకు అవార్డులు ప్రదానం

జిల్లాలో ఎంపికైన మూడు స్వచ్ఛ గురుకుల పాఠశాలలకు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ క్యాష్ అవార్డులు కలెక్టరేట్‌లో సోమవారం ప్రదానం చేశారు. జిల్లాలో ఇమాంపేట టీఎస్‌డబ్ల్యూఆర్ ఎస్‌కు మొదటి బహుమతిగా రూ. 20 వేలు, మునగాలకు రెండో బహుమతిగా రూ. 15వేలు, హుజూర్‌నగర్‌కు మూడో బహుమతిగా రూ. 10 వేల చెక్కులను అందించారు. కార్యక్రమంలో ఆర్‌సీఓ అరుణకుమారి, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ శైలజ, ఇమాంపేట,మునగాల, హుజూర్‌నగర్ గురుకులాల ప్రిన్సిపల్స్ ఝాన్సీరాణి, వెంకటేష్, రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యానవన శాఖ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ , అధికారులు

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం జనవరి 18 నుంచి జూన్ 30వరకు 100రోజులు నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, మెప్మా ఆర్‌పీలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. ప్రతి వార్డులో కంటి సమస్యతో బాధపడుతున్న వారిని సర్వే ద్వారా గుర్తించాలని, వారిని కంటి వెలుగు క్యాంపులకు తీసుకెళ్లి పరీక్షలు చేయించాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ పి. రామానుజులరెడ్డి మాట్లాడారు. కంటి వెలుగు కార్యక్రమంలో సిబ్బంది అశ్రద్ధ వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 40వ వార్డు కౌన్సిలర్ తాహేర్, అర్బన్ హెల్త్ డాక్టర్లు రమ్యారెడ్డి, శ్రీకాంత్, మున్సిపల్ మేనేజర్ మున్వర్ అలీ, డీఎంఎస్ రమేష్ నాయక్, ఆర్‌పీలు, వార్డు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మఠంపల్లి మండలం మట్టపల్లి మహాక్షేత్రంలో శ్రీ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య, శాశ్వత కల్యాణాన్ని సోమవారం అర్చకులు వేద మంత్రోచ్చరణలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదాన్ని రసరమ్యంగా రక్తికట్టించారు. కల్యాణ వేడుకలో భాగంగా విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాశన, మధుపర్కర పూజ, మాంగళ్యధారణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం మహా నివేదనతో భక్తులను తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, నర్సింహమూర్తి, ఆంజనేయచార్యులు పాల్గొన్నారు.



తాళిబొట్టు చూపిస్తున్న అర్చకుడు

పార్కింగ్ పాట్లు

- కోదాడ పట్టణంలో పార్కింగ్ స్థలాల కొరత
- వాహనాలు నిలపడానికి తీవ్ర ఇబ్బందులు
- చడీచప్పుడు లేకుండా చలానాలు విధిస్తున్న పోలీసులు
- ఫోన్‌మెసేజ్ వచ్చే వరకు తెలియని పరిస్థితి

కోదాడ: కోదాడ పట్టణంలో పార్కింగ్ స్థలాల సమస్య వేధిస్తోంది. పనుల నిమిత్తం బజారుకు వెళ్తే చాలు వాహనాలు ఎక్కడ నిలపాలో అర్థకాని పరిస్థితి నెలకొంది. దుకాణాల ముందు నిలిపి పనులు చక్కబెట్టుకొని వచ్చే వరకే పోలీసులు ఫొటోలు తీసి చలానాలు విధిస్తున్నారు.

నిత్యం నో పార్కింగ్ చలాన్లు...

మున్సిపాలిటీగా మారిన కోదాడ పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. పట్టణంలో దుకాణాలన్నీ ప్రధాన రహదారిపైనే ఉన్నాయి. అయితే ఇక్కడ ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు నిలపడానికి ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేవు. దుకాణాల్లో వివిధ వస్తువులు కొనుగోలు చేయడానికి వస్తున్న వారు ఆయా దుకాణాల ముందు తమ వాహనాలు నిలిపి పనులు చూసుకొని వచ్చే వరకు పోలీసులు కనీసం హెచ్చరికలు చేయకుండా ఫొటోలు తీసుకొని పోతున్నారని, ఇంటికి వెళ్లిన తరువాత సెల్‌ఫోన్‌కు మెసేజ్ వచ్చే వరకు ఈ విషయం తమకు తెలియడం లేదని వాహనదారులు వాపోతున్నారు.

ఆటోలకు అదే పరిస్థితి...

కోదాడ నియోజకవర్గంలో ఉన్న వంద గ్రామాల్లో కేవలం 10 నుంచి 15 గ్రామాలకే ఆర్టీసీ బస్సులను నడుపుతోంది. దీంతో మిగతా గ్రామాల నుంచి ప్రజలు కోదాడకు ఆటోల్లో ప్రయాణిస్తుంటారు. దీనికి తోడు లోకల్ ఆటోలు వందల సంఖ్యలో ఉన్నాయి. వీరందరికీ ఎక్కడా పార్కింగ్ సౌకర్యం లేదు. ప్రయాణికులను ఎక్కించుకోవడాని, దింపడానికి ఆటోలను రోడ్డు మీదనే ఆపుతుండడంతో పోలీసులు నో పార్కింగ్ చలానాలు విధిస్తున్నారు.

వీరిపై చర్యలేవి..

కోదాడ పట్టణంలో ప్రధాన రహదారి వెంట ఉన్న బహుళ అంతస్తుల భవనాల నిర్మాణ సమయంలో సెల్లార్‌ను పార్కింగ్‌కు చూపుతున్నారు. నిర్మాణం పూర్తి అయిన తరువాత ఆ సెల్లార్‌లలో దుకాణాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇస్తున్నారు. ఈ విషయం తెలిసిన పోలీసులుగానీ, మున్సిపాలిటీ అధికారులుగానీ చర్యలు తీసుకోవడంలేదు. పార్కింగ్ వసతి చూపాల్సిన బాధ్యత మీదేనని వారికి నోటీసులు జారీ చేయకుండా వాహనదారులపై ఫైన్ వేస్తున్నారు.

టార్గెట్లు విధిస్తున్నారా..

కోదాడ పట్టణంలో ట్రాఫిక్ పోలీసులతో పాటు పట్టణ పోలీసులు నిత్యం వాహనాల్లో తిరుగుతూ ట్రాఫిక్ కంట్రోల్ చేయడానికన్నా చలానాలు విధించడానికే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారనే విమర్శలున్నాయి. ముఖ్య కూడళ్లలో గుంపులుగా ఉండి వాహనదారులను అడ్డగించి మరీ చలానాలు విధిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు, టార్గెట్ల మేరకే తాము పని చేస్తున్నామని, దీనిలో తమ తప్పు ఏమీ లేదని ఓ కానిస్టేబుల్ చెప్పారు.



ఈ కారును యజమాని కోదాడ పట్టణంలో ఎవరికీ ఇబ్బంది లేకుండా రోడ్డు పక్కన ఉన్న మార్జిన్‌లో నిలిపి ఉంచాడు. కానీ ట్రాఫిక్ పోలీసులు మాత్రం రాంగ్ పార్కింగ్ పేరుతో చలానా విధించారు. ఆ రోజు కారు నిలిపిన ప్రదేశంలో ఇంకా దుకాణాలు కూడా తెరవలేదు. ఇవేమీ పట్టించుకోకుండా రాంగ్ పార్కింగ్ పేరుతో చలానా విధించారు. ఇలా కోదాడ పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులకు నిత్యం చలానాల రూపంలో వడ్డింపులు తప్పడంలేదు.

ప్రధాన సమస్య ఆస్పత్రులు, బ్యాంకుల వద్దే..

కోదాడ పట్టణంలో పార్కింగ్ సమస్య బ్యాంకులు, ప్రైవేట్ వైద్యశాలల ముందు ఏర్పడుతోంది. నయానగర్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన మున్సిపాలిటీ బ్యాంక్ బ్రాంచ్ వద్ద, హుజూర్‌నగర్ రోడ్డు నందగోపాల్ వైద్యశాల వద్ద, నాగార్జున సెంటర్‌లో మీసేవ, కరూర్ వైశ్యాబ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, సంత ఎస్‌బీ ఐ వద్ద పార్కింగ్ సమస్య ఉంది.

నిబంధనలు పాటించని వారిపైనే చర్యలు

పట్టణంలోపార్కింగ్ స్థలాలులేని మాట వాస్తవమే. కానీ ట్రాఫిక్ నిబంధనలు ఏమాత్రం పాటించని వారిపైనే చలానాలను విధిస్తున్నాం . బ్యాంకులు, వైద్యశాలలు పార్కింగ్ వసతి ఏర్పాటు చేసుకోవడంతో పాటు అక్కడ సిబ్బందిని నియమించుకొని ఇబ్బంది లేకుండా చూసుకోవాలి.

– వెంకటేశ్వరరెడ్డి, డీఎస్పీ, కోదాడ

క్లుప్తంగా

'యాదాద్రి'లో ఆక్టోపస్ బలగాల మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసే దిశగా పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి 10గంటల తర్వాత ఆక్టోపస్ బలగాలు ఆలయానికి చేరుకుని మాక్ డ్రిల్ చేపట్టారు. రాత్రి 10గంటల నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు ఈ మాక్‌డ్రిల్ కొనసాగింది. ఆలయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన చర్యలపై ఆక్టోపస్ బలగాలు స్థానిక అధికారులతో చర్చించారు.

గుంటుకగూడెం తాత్కాలిక సర్పంచ్‌గా శంకరయ్య



తాత్కాలిక సర్పంచ్‌గా శంకరయ్య ఎన్నికైనట్లు ప్రకటిస్తున్న ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్

నిడమనూరు: మండలంలోని గుంటుకగూడెం తాత్కాలిక సర్పంచ్‌గా నాల్గో వార్డు సభ్యుడు శంకరయ్య ఎన్నికయ్యారు. గతంలో సర్పంచ్‌గా పనిచేసిన గన్నెపాక స్వామి ఎన్నికైన ఎనిమిది నెలలకే మృతిచెందాడు. దీంతో ఉప సర్పంచ్ అక్కి సరితను తాత్కాలిక సర్పంచ్‌గా నియమించారు. అయితే అక్కి సరితపై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి దించారు. ఈ క్రమంలో సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించగా, నాల్గో వార్డు సభ్యుడు గుడిసె శంకరయ్యను ఉప సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. దీంతో ఆయనే తాత్కాలిక సర్పంచ్‌గా వ్యవహరించనున్నారు. చెక్ పవర్‌పై సంతకం కోసం సీనియర్ వార్డు సభ్యుడు ప్రవీణ్ కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే టికెట్ ఇవ్వాలి

అడ్డగూడూరు: వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ టికెట్‌ను స్థానికులకే ఇవ్వాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ మందుల సామేల్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తాను తుంగతుర్తి నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉండి ప్రతి గ్రామంలో ఉద్యమాన్ని ముందుండి నడిపించినట్లు తెలిపారు. తన పనితనాన్ని గుర్తించి సీఎం కేసీఆర్ 2016లో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా తనకు అవకాశం కల్పించారని అన్నారు. రైతాంగ అభివృద్ధి కోసం తన సొంత మండలం అడ్డగూడూరులోని చౌల్లరామారం గ్రామశివారులో గల ప్రభుత్వ భూమిలో 15 మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాంలను మంజూరు చేయించి 2020 జూలై 12న శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్‌ను ఆహ్వానించినా వారు రాలేదని అన్నారు. కానీ ఆదివారం నిర్వహించిన గోదాంల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ చైర్మన్‌నైన తనను ఆహ్వానించకుండా అవమానపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని, వచ్చే ఎన్నికల్లో తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని కోరనున్నట్లు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటా

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



డైరీ ఆవిష్కరిస్తున్న యాదాద్రి డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, బీర్ల అయిలయ్య, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

భువనగిరి: విద్యుత్ ఉద్యోగులకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి పట్టణంలోని సాయి కన్వెన్షన్ హాల్‌లో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327, ఐఎన్‌టీయూసీ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు విద్యుత్ ఉద్యోగులు ముందంజలో ఉంటారన్నారు. అనంతరం తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ యూనియన్-327 అధ్యక్షుడు, ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు డాక్టర్ జి. సంజీవరెడ్డి, ఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి. రఘుమారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ శాఖ మంత్రితో సంప్రదించి 2022లో ఇవ్వావల్సిన పీఆర్‌సీ విషయంలో నిర్ణయం తీసుకునే విధంగా కృషిచేస్తామన్నారు. బొగ్గు ధర, రవాణా ఖర్చులు పెరిగి సంస్థపై భారం పడటం వల్ల వేతనాలు చెల్లింపులో జాప్యం జరుగుతుందని చెప్పారు. భూగర్భ జలాలు పెరగడం వల్ల వ్యవసాయంలో సాగు విస్తీర్ణం పెరగడంతో విద్యుత్ వినియోగం పెరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. సంస్థలో వచ్చే ప్రతి సమస్యకు కార్మికులు కారణం కాదని యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వల్లనే వస్తుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సంస్థకు ముఖ్యమని వారికి సేవలందించడంతో ఉద్యోగులు ముందుండాలని అన్నారు. నూతనంగా ప్రవేశపెట్టిన నాసా విధానం వల్ల సంస్థకు రూ.కోటి ఆదాయం వచ్చిందన్నారు. అనంతరం డైరీని ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బీర్ల అయిలయ్య, ఇనుగుల శ్రీధర్, సురేష్ కుమార్, భూపాల్‌రెడ్డి, ఎస్ఈ శ్రీనాథ్, యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, ఐలయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సతీష్, కార్యదర్శులు నర్సింగ్‌రావు, బండారు శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఆత్మకూరు(ఎస్)(సూర్యాపేట): మండల పరిధిలోని ఏనుబాముల గౌడ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, ఏనుబాముల గౌడ సంఘం అధ్యక్షుడు పసునూరి తిరుమలేష్, నాయకులు గిలకత్తుల సర్వయ్య గౌడ్, పసునూరి లక్ష్మయ్య, వత్సవాయి శ్రీరాములు, తండు అంజయ్య, వత్సవాయి అయోధ్య, అండం నాగరాజు, పసునూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

అవంతీపురం గ్రామ సమస్యలు పరిష్కరించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



ఖాళీ బిందెలతో ఆర్డీఓ కార్యాలయానికి పాదయాత్రగా వెళ్తున్న సీపీఎం నాయకులు, అవంతీపురం గ్రామస్తులు

మిర్యాలగూడ: మండలంలోని అవంతీపురం గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం గ్రామస్తులతో కలిసి అవంతీపురం నుంచి మిర్యాలగూడ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు పక్కా ఇళ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవంతీపురం కొత్త కాలనీలోని ప్రజలు విష సర్పాలతో సహజీవనం చేస్తూ వాటికి బలైపోతున్నారని అన్నారు. అధికారులు స్పందించి గ్రామంలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, పాదూరి గోవర్ధని, ఉర్మిళ, లింగయ్య, కుందుకూరు రమేష్‌బాబు, పిల్లుట్ల సైదులు, గోవిందరెడ్డి, రామకృష్ణ, కోటయ్య, వెంకన్న, మోతె సైదులు, శివ, వెంకన్న, జ్యోతి, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో పత్తి రైతు ఆత్మహత్య



ఉరి వేసుకున్న శేఖర్‌రెడ్డి

శాలిగౌరారం : కాలం కలిసిరాలేదు.. వాతావరణం అనుకూలించలేదు.. పత్తిపంట సాగు చేసిన ఓ రైతు దిగుబడులు రాక పంట సాగుకోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక పంటచేనులో చెట్టుకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలోని పెర్కకొండారంలో ఆదివారం జరుగగా సోమవారం వెలుగులోకి వచ్చింది. అందుకు సంబంధించి బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెర్కకొండారం గ్రామానికి చెందిన కాసర్ల శేఖర్‌రెడ్డి(65) తనకున్న మూడెకరాల భూమితో పాటు గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద ఐదెకరాల భూమి కౌలుకు తీసుకొని పత్తిపంటను సాగుచేశాడు. పంటసాగు కోసం బంధువులు, గ్రామస్తుల వద్ద సుమారు రూ.10 లక్షలు అప్పులు చేశాడు. అధిక వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతినడంతో దిగుబడి రాలేదు. దీంతో పంటసాగుకోసం చేసిన అప్పులు తీర్చేందుకు తరచూ మనోవేదనకు గురవుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం తన బంధువుల ఊరికి వెళ్లొస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. గ్రామ శివారులోని తన వ్యవసాయ భూమిలో చెట్టుకు విద్యుత్ కేబుల్‌వైర్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోమవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన మృతుడి అన్న కొడుకు కాసర్ల రవీందర్‌రెడ్డి తన బాబాయి శేఖర్‌రెడ్డి మృతిచెంది చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో కుటుంబీకులకు ఫోన్‌ద్వారా సమాచారం అందించాడు. మృతుడి కుమారుడు కాసర్ల వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నకిరేకల్ ప్రభుత్వాసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



రమావత్ గంగ్యా (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు జారిపడి తీవ్ర గాయాలపాలైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం ట్యాంకుతండాకు చెందిన రమావత్ గంగ్యా(48) యాదాద్రి జిల్లా వలిగొండ ఎంపీడీఓ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు వలిగొండకు వెళ్లి శబరి ఎక్స్‌ప్రెస్ రైలులో మిర్యాలగూడకు తిరిగి వస్తున్నాడు. మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు దిగుతూ జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. రైలు డ్రైవర్ సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు వెంటనే అక్కడకు చేరకుని అతడిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే జీఆర్‌పీ పోలీసులు పేర్కొన్నారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలుశిక్ష



నిందితులు పూలమ్మ, స్వామి, నవీన్

అడ్డగూడూరు: హత్యాయత్నం కేసులో మండల పరిధిలోని డి.రేపాక గ్రామానికి చెందిన ముగ్గురికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సోమవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూవివాదంలో భాగంగా 2014 సంవత్సరంలో డి.రేపాక గ్రామానికి చెందిన గ్యార స్వామి, గ్యార పూలమ్మ, సూరారం నవీన్ కలిసి అదే గ్రామానికి చెందిన గ్యార స్వరూప మీద కత్తితో దాడి చేసి గాయపర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో సోమవారం ఈ కేసు తుది విచారణ జరగ్గా ముగ్గురిపై నేరం రుజువు కావడంతో వారికి 5సవంత్సరాల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు. దీంతో ముగ్గురు నిందితులను జైలుకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కరెంట్ హీటర్ తగిలి మహిళ మృతి



ఆమని (ఫైల్)

సూర్యాపేట క్రైం: కరెంట్ హీటర్ తగిలి మహిళ మృతిచెందిన ఘటన సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. సూర్యాపేట పట్టణంలోని గొల్లబజార్ 39వ వార్డులో నివాసముంటున్న టింగిల్‌కార్ ఆమని(27) ఇంట్లో కరెంట్ హీటర్ పెట్టబోయి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతదేహానికి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వకుండా మోసం

- రైస్‌మిల్లు యజమానుల రిమాండ్

మిర్యాలగూడ టౌన్: ప్రభుత్వానికి కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా మోసం చేసిన కేసులో మిర్యాలగూడ మండలంలోని వజ్ర రైస్‌మిల్లు యాజమానులను రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం మిర్యాలగూడ కోర్టులో హాజరుపర్చగా వారిని 14 రోజుల పాటు రిమాండ్‌కు తరలించాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి తీర్పునిచ్చారు. రూరల్ సీఐ ముత్తినేని సత్యనారాయణ, ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020-21 రబీ సీజన్‌కు గాను ధాన్యాన్ని సీఎంఆర్ చేసి ఎఫ్‌సీఐకి పంపే విధంగా తెలంగాణ సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ వారు మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లికి చెందిన వజ్ర రైస్ మిల్లుకు రూ.7.89 కోట్ల విలువ చేసే 4339.960 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించారు. కానీ వజ్ర రైస్ మిల్లు యాజమాన్యం సీఎంఆర్ ఇవ్వకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్ఆర్ యాక్ట్‌ను అమలు చేశారు. ఈ మేరకు నిల్వ ఉన్న ధాన్యాన్ని వేలం వేయడంతో రూ.కోటి ప్రభుత్వం దక్కించుకోగా, సుమారు రూ.5.90 కోట్ల వరకు వజ్ర రైస్ మిల్లు వారు సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్ వారికి ఇవ్వాల్సి ఉంది. కానీ ఉద్దేశపూర్వకంగానే సీఎంఆర్ చేయకుండా ప్రభుత్వాన్ని మోసం చేసినందుకు ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులు మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గతేడాది అక్టోబర్‌లో వజ్ర రైస్ మిల్లు మేనేజింగ్ డైరెక్టర్ వజ్ర అపర్ణ, వజ్రపు అనురామ్, సత్యనారాయణపై కేసు నమోదు చేశారు. వీరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

కూల్‌డ్రింక్ షాపులో చోరీ

నాగారం: గుర్తుతెలియని వ్యక్తులు కూల్‌డ్రింక్ షాపులో చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి నాగారం బంగ్లా వద్ద చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన కన్నెబోయిన అనిల్ వర్ధమానుకోటకు వెళ్లేదారిలో వైన్స్ ఎదురుగా కూల్‌డ్రింక్ షాపును నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగా ఆదివారం రాత్రి 10గంటల తర్వాత దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు షాపు పైకప్పు రేకులను తొలగించి లోపలకు చొరబడి రూ.20వేల నగదుతో పాటు కూల్‌డ్రింక్స్ ఎత్తుకెళ్లారు. అదేవిధంగా ఎదురుగా ఉన్న రెడ్డి దాబాలో రెండు సిలిండర్లను చోరీ చేసినట్లు దాబా యజమాని రవీందర్‌రెడ్డి తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు అనిల్, రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ రైల్వే స్టేషన్ పరిధిలో రైలు పట్టాలపై ఆదివారం రాత్రి గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్‌ఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపారు. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించామని, మృతదేహం గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైందని, మృతుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

కొత్తతండాలో వరద బీభత్సం



కొత్తతండా వీధుల్లో పారుతున్న వరదనీరు



జేసీబీతో కాల్వలో చెత్తాచెదారాన్ని తొలగింపజేస్తున్న సర్పంచ్ విజయ

- పొంగిపొర్లిన మట్టపల్లి మేజర్ కాల్వ
- గ్రామ వీధుల్లో ఉధృతంగా పారిన వరద
- ధ్వంసమైన రోడ్లు, పైపులైన్లు

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి మేజర్ కాల్వ పొంగిపొర్లడంతో కొత్తతండా వీధుల్లో వరద బీభత్సం సృష్టించింది. ఈ సంఘటన సోమవారం చోటుచేసుకుంది. తండా సమీపం గుండా వెళ్లే ఎన్ఎస్‌పీకి చెందిన మేజర్ కాల్వలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీంతో నీరంతా కాల్వ మీదుగా పొంగిపొర్లి కొత్త తండా వీధుల గుండా ఉధృతంగా ప్రవహించింది. దీంతో తండాలోని వీధులు, నీటి పైపులైన్లు ధ్వంసం అయ్యాయి. వెంటనే స్పందించిన స్థానిక సర్పంచ్ బానోతు విజయబాలానాయక్ జేసీబీతో ఎన్ఎస్‌పీ కాల్వలో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడంతో నీరు అదే కాల్వలో సాఫీగా ముందుకు సాగింది. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. మట్టపల్లి మేజర్‌కు వస్తున్న నీటిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో రెండురోజులుగా మేజర్ కాల్వలో చెత్తాచెదారం, పూడిక నిండి ఉండడంతో వరదంతా కిందికి వెళ్లకుండా కాల్వ మీదుగా గ్రామంలోకి వచ్చిందన్నారు. ముందే అధికారులకు ఫిర్యాదు చేయగా నీటి విడుదలను తగ్గించారన్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే కాల్వ నీరు ఊరి మీదుగా ప్రవహించి తీవ్రనష్టం జరిగిందని అన్నారు.

నల్లతామర తెగులు గుర్తించి నిర్మూలించాలి



రావులపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న సూర్యాపేట జిల్లా ఉద్యాన శాఖ అధికారి స్రవంతి

తుంగతుర్తి: మిరప పంటను ఆశిస్తున్న నల్లతామర తెగులును మొదటి దశలోనే గుర్తించి నిర్మూలించాలని, మిరప సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూర్యాపేట జిల్లా ఉద్యానవన శాఖ అధికారి స్రవంతి అన్నారు. మండల పరిధిలోని రావులపల్లిలో సాగుచేసిన మిరప పంటను సోమవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. నల్లతామర తెగులు నివారణకు లీటరు నీటికి 10వేల పీపీఎం వేపనూనె, 3మి.లీ కలిపి పిచికారీ చేయాలన్నారు. జీవ నియంత్రణ శిలీంద్రాలైన బవేరియా బాషియాన లేదా లెకానిశీలియం లేఖలి 5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వేరు కుళ్లు నివారణతో పాటు ఇతర మిరప తోటలకు వచ్చే ముడత, పువ్వు రాలడం, పింద రాలడం వంటి వాటికి ఉద్యానవన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి మందులను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభాల బాట

- నాలుగెకరాల్లో జీరో బడ్జెట్‌తో వరి, కూరగాయలు, ఆకుకూరలు సాగు
- సహజ సిద్ధమైన కషాయాలు వాడుతూ ఆదర్శంగా నిలుస్తున్న వెంకటరెడ్డి, కవిత దంపతులు



పాడి పంట



తన వ్యవసాయ క్షేత్రంలో వెంకటరెడ్డి సాగుచేసిన దేశవాళీ వరి పంట

నడిగూడెం: ఎలాంటి పెట్టుబడి లేకుండా జీరో బడ్జెట్ విధానంలో గత 10 సంవత్సరాలుగా తనకున్న నాలుగు ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ, పంట మార్పిడి విధానాన్ని పాటిస్తూ అధిక లాభాలు పొందుతున్నారు నడిగూడెం మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన నాగిరెడ్డి వెంకటరెడ్డి, కవిత దంపతులు. ప్రకృతి వ్యవసాయ పితామహుడు డాక్టర్ పాలేకర్ వద్ద రెండు సార్లు శిక్షణ పొంది రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా గోఆధారిత వ్యవసాయం చేస్తూ తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వరి, వేరుశనగ, కంది, పెసర, పసుపు పంటతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సహజ సిద్ధంగా పండిస్తున్నారు. భూసారం పెరిగేందుకు నవ ధాన్యాలు సాగు చేస్తున్నారు. అదేవిధంగా వీరికి అనారోగ్య సమస్యలు ఎదురైతే ఇంట్లోనే గోఆధారిత ఉత్పత్తులు వాడుతూ, రోగనిరోధక శక్తిని తట్టుకునే ఆహారం తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. అంతేకాకుండా వెంకటరెడ్డి పెంచుతున్న రెండు ఎద్దులు, నాలుగు ఆవులు, రెండు దూడలకు కూడా నాణ్యమైన గ్రాసం అందిస్తూ, ఎటువంటి యంత్రాలు వాడకుండా ఎద్దులు, ఆవులతోనే భూమి దున్ని పంటలు సాగు చేస్తున్నాడు. వ్యవసాయంలో వస్తు రవాణాకు ఎడ్లబండిని కూడా ఉపయోగిస్తున్నారు. తన పొలంలో పండిన పంటను చుట్టుపక్కల గ్రామాల వారికి అమ్ముతూ ఎటువంటి పెట్టుబడి లేకుండా లాభాలు ఆర్జిస్తున్నారు.

దేశవాళీ వరి రకాల సాగు..

వెంకటరెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో విత్తన అభివృద్ధి కోసం ఒక ఎకరంలో దేశీ వరి రకాలైన నవారా, చిట్టిముత్యాలు, సిద్ద సన్నాలు, రత్నచోడి, 33 మహారాజ్, మైసూరు మల్లిక, బాస్మతి తదితర రకాలు సాగు చేస్తూ ఆ విత్తనాలను చుట్టుపక్కల వారికి విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు.

చీడపీడల నివారణకు కషాయాల తయారీ

వివిధ రకాల కషాయాలను ఉపయోగించి పంటలకు ఆశిస్తున్న చీడపీడల నివారిస్తున్నారు. జీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం, అగ్నిహాస్త్రం, దశపర్ణి, వేపగింజలు, బీజామృతం, మట్టిద్రావణం, బవేరియా బాసియానా, వర్టిసిల్లం, మెటారైజం తదితర ద్రావణాలు, పదార్థాలను సొంతంగా తయారు చేసుకుని చీడపీడల నివారణకు, భూసారం పెరిగేందుకు ఉపయోగిస్తున్నాడు.

జీవామృతంతో ఆరోగ్యంగా పంట

జీవామృతం ఉపయోగిస్తే పంట ఆరోగ్యంగా పెరుగుతుందని వెంకటరెడ్డి దంపతులు చెబుతున్నారు. 5లీటర్ల గోమూత్రం, 10కిలోల పెండ, 2కిలోల పాత బెల్లం, 2 నుంచి 4కిలోల పప్పు ధాన్యాల పిండి, పిడికెడు పుట్టమట్టి, 200లీటర్ల నీటిని కలిపి రెండు రోజుల పాటు మురగబెట్టి తయారు చేసిన కషాయాన్ని నేరుగా ప్రతి 15రోజులకు ఒకసారి పంట మొదళ్ల తడిసేలా చల్లితే ఎటువంటి చీడపడలు ఆశించవని పేర్కొంటున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వలన భూసారం తగ్గి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని, కావున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని వెంకటరెడ్డి, కవిత దంపతులు సూచిస్తున్నారు.

ప్రభుత్వం ప్రోత్సహించాలి

నాకున్న నాలుగు ఎకరాల భూమిలో గత 10 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయ పితామహుడు పాలేకర్ స్ఫూర్తితో జీరో బడ్జెట్ విధానంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాము. ఎలాంటి ఖర్చులు లేకుండా వరి, వేరుశనగ, కంది, పెసర, పసుపు పంటలతో పాటు ఇంటి అవసరాలకు వంగ, టమాట, ఆకుకూరలు సాగు చేస్తున్నాను. మాలాంటి చిన్న, సన్నకారు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తే బాగుంటుంది. ఇంకా గ్రామాల నుంచి రైతులు కూడా ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు రావాలి. ప్రతి రైతు కుటుంబం ఆరోగ్యంగా ఉండాలంటే ఒక అర ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి. - నాగిరెడ్డి వెంకటరెడ్డి, నారాయణపురం



కషాయం తయారు చేస్తున్న వెంకటరెడ్డి, కవిత దంపతులు